ఎమ్మెల్యేపైనే అభివృద్ధి ఆశలు..

- రోడ్ల మరమ్మతు కరువు
- అదనపు ఆయకట్టు కోసం ఎదురుచూపు
- పరిశ్రమల నిర్మాణం ఊసే లేదు



రామడుగులోని అసంపూర్తి బ్రిడ్జి నిర్మాణం



అసంపూర్తిగా గుమ్లాపూర్ రోడ్డు నిర్మాణం

చొప్పదండి: అధికంగా మెట్ట ప్రాంతం ఉన్న చొప్పదండి నియోజకవర్గంలో నేతల హామీలు ఎన్నికల వరకే పరిమితమవుతుండటంతో.. తెలంగాణలో తొలిసారి ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు. శాసనసభకు తాజాగా జరిగిన ఎన్నికల్లోనూ అధికార పార్టీకి చెందిన అభ్యర్థే ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఈసారైనా నియోజకవర్గంలో అభివృద్ధి బాటలు పడతాయని ప్రజలు ఆశిస్తున్నారు. మూడు పర్యాయాలుగా రాష్ట్రంలో అధికారం చేపట్టిన పార్టీకి చెందిన ఎమ్మెల్యేనే అధికారంలో ఉంటుండగా.. ఈసారీ ప్రజలు అధికార పార్టీ అభ్యర్థికే పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో సాగునీటి రంగం, పల్లెల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్య, వైద్యం వంటి అంశాల్లో దశాబ్దాలుగా వెనకబడిపోయిన చొప్పదండి నియోజకవర్గంలో ప్రభుత్వం తాను ప్రకటించిన గ్యారంటీలకే పరిమితం కాకుండా అభివృద్ధి పరుగులు పెట్టించాలని స్థానికులు కోరుకుంటున్నారు. గతంలో అభివృద్ధి కార్యక్రమాలు అసంపూర్తిగా ఉండటం, పలు ప్రతిపాదనలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజల్లో కొత్త ప్రభుత్వంపై ఆశలు చిగురింపజేస్తున్నాయి. నియోజకవర్గంలోని సాగు భూముల్లో సగభాగానికి పైగా వర్షాధారం, వ్యవసాయ బావులపైనే ఆధారపడగా.. గ్రామాలతో పాటు మండల కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలందకపోవడంతో ఇక్కడి ప్రజలు జిల్లా కేంద్రాలకు వెళ్తున్నారు. నియోజకవర్గంలో ఉన్నత విద్యావకాశాలు విరివిగా లేకపోవడంతో విద్యార్థులు, పరిశ్రమల నిర్మాణం లేకపోవడంతో ఉపాధి అవకాశాలు రాక యువత, నిరుద్యోగులు మార్పు కోసం ఎదురుచూస్తున్నారు. వ్యవసాయం లాభసాటిగా లేకపోవడంతో భార్యాపిల్లలను వదిలి ఇక్కడి ప్రజలు సౌదీ, మస్కట్, యూఏఈ, సింగపూర్ వంటి దేశాలకు జీవనోపాధికి తరలివెళ్తున్నారు.

సాగునీరేది..

- చొప్పదండి మండలం గుమ్లాపూర్, కాట్నపల్లి, సాంబయ్యపల్లి, చిట్యాలపల్లి, మంగళపల్లి గ్రామాలు నాన్ కమాండ్ ఏరియాలో ఉండగా.. లక్ష్మీపూర్ అండర్ టన్నెల్ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా రూ.తొమ్మిదిన్నర కోట్లతో చెరువులు నింపి మెట్ట ప్రాంతానికి సాగునీరందించే ప్రతిపాదనల అమలు కోసం ఆయా గ్రామస్తులు ఎదురుచూస్తున్నారు. గతంలో సర్వే చేసి ప్రతిపాదనలు పంపినా బుట్టదాఖలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మూడు మండలాల రైతుల సాగునీటి వనరైన మోతె జలాశయం నిర్మాణం అటకెక్కించి.. అదే స్థానంలో చేపట్టిన మోతె కాలువల నిర్మాణం ముందుకు సాగకపోవడంతో ఆరంభ శూరత్వంగా మారింది. సాగునీటి ఆశలకు మూలంగా ఉన్న ఈ ప్రాజెక్ట్ పూర్తి కాకపోవడంతో రైతుల్లో నిరాశ కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.
- చొప్పదండి మండలం రుక్మాపూర్ శివారులోని ప్రభుత్వ రిజర్వు భూముల్లో నిర్మించతలపెట్టిన లెదర్ పార్కుకు రెండు దశాబ్దాలుగా నిధుల కేటాయింపు జరగడం లేదు. ఈ పరిశ్రమకు నిధులు కేటాయిస్తే అంతర్జాతీయ స్థాయిలో తోళ్ల పరిశ్రమ ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి పైగా నిరుద్యోగులు, చర్మకారులకు ఉపాధి కల్పించే ఆస్కారం ఉంది. ఎమ్మెల్యేలు మారుతున్నారు తప్ప చర్మ పరిశ్రమపై ఉలుకుపలుకు లేదు.
- మండల కేంద్రాల్లో 30పడకల ఆసుపత్రుల నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. పూర్తిస్థాయి వైద్య సదుపాయాలు లేక నియోజకవర్గ ప్రజలు మెరుగైన వైద్యానికి కరీంనగర్, జగిత్యాల వంటి ప్రాంతాలకు వెళ్తున్నారు. చొప్పదండి పట్టణంలో వంద పడకల ఆసుపత్రికి ప్రతిపాదించినా అమలుకు నోచుకోలేదు.
- ప్రభుత్వ రంగంలో ఉన్నత వృత్తి విద్యావకాశాలు లేక విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్తూ చదువుకొనేందుకు ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నారు.
- చొప్పదండి, రామడుగు మండల కేంద్రాల మధ్య చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండి నియోజకవర్గ ప్రజలకు శాపంగా మారింది.
- రామడుగు మండల కేంద్రం నుంచి షానగర్ వెళ్లే దారిలో పాత బ్రిడ్జి ప్రమాదకరంగా మారగా.. కొత్త బ్రిడ్జిని పూర్తి చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది.
- నారాయణపూర్ ప్రాజెక్టు, కాలువలు, నష్టపరిహారం తదితర ప్రాధాన్యతాంశాలపై దృష్టి సారించాల్సి ఉంది.

క్లుప్తంగా

పొన్నం మరింత ఎదగాలని పూజలు

సైదాపూర్: హుస్నాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పొన్నం ప్రభాకర్ ఆరోగ్యంగా ఉంటూ మరిన్ని ఉన్నత పదవులు పొందాలని శనివారం సైదాపూర్ హనుమాన్ దేవాలయంలో నాయకులు పూజలు చేశారు. మండల అధ్యక్షుడు దొంత సుధాకర్, సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, సర్పంచ్ వెంకటరెడ్డి, న్యాయవాది వెంకటేశ్వర్‌రావు, మహేందర్‌రెడ్డి, కిషన్ నాయక్, కస్తూరి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గానికి కవ్వంపల్లి రాక

మానకొండూర్: మానకొండూర్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా మానకొండూర్ నియోజకవర్గంలో ఆదివారం అడుగు పెట్టనున్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అనంతరం మానకొండూర్‌కు వస్తుండటంతో స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు భారీఎత్తున తరలిరానున్నారని కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి తెలిపారు. ఉదయం 10-11 గంటల మధ్య బెజ్జంకి మండలానికి చేరుకొని అక్కడి నుంచి నేరుగా ఓపెన్ టాప్ జీపులో గన్నేరువరం మండలం గుండ్లపల్లి, తిమ్మాపూర్ మండలం, మానకొండూర్ నియోజకవర్గ కేంద్రం మీదుగా శంకరపట్నం మండలానికి చేరుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారని, దారి పొడవునా ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు భారీఎత్తున తరలివచ్చి స్వాగతం పలకాలని కోరారు.

గడపగడపకు ఏడాది



పారువెల్లలో ప్రచారం చేస్తున్న కవ్వంపల్లి(ఫైల్)

గన్నేరువరం: మానకొండూర్ నియోజకవర్గ సమస్యలను ప్రశ్నించడంతో పాటు ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ 2022 డిసెంబర్ 9న గడపగడపకు కాంగ్రెస్.. ఇంటింటికి కవ్వంపల్లి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం నేటికి ఏడాది పూర్తయింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌పై గెలుపొందిన కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యేగా అదే 9వ తేదీన అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. గతేడాది మండలంలోని పారువెల్ల గ్రామ శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ప్రచారం చేపట్టారు. కవ్వంపల్లి సత్యనారాయణ ఎమ్మెల్యేగా గెలుపొందడానికి గన్నేరువరం మండలంలోని సమస్యలే కేంద్ర బిందువుగా మారాయి. ఇక్కడి నుంచే రసమయి బాలకిషన్‌కు అసమ్మతి ప్రారంభమై చివరికి ఓటమి వరకు తీసుకెళ్లింది. ప్రధానంగా గుండ్లపల్లి నుంచి వయా మండల కేంద్ర గన్నేరువరం మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పొత్తూరు గ్రామం వరకు డబుల్ రహదారిగా చేపట్టాలని కోరుతూ యువజన సంఘాల నాయకుడు, ప్రస్తుత యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, యువకులు ధర్నాలు, రాస్తారోకో చేపట్టారు. కవ్వంపల్లి పాల్గొని నిరసన తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ దుస్థితిపై కవ్వంపల్లి నిలదీశారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



ఆర్టీసీ అధికారికి వినతి పత్రం ఇస్తున్న ఉదయ్

గన్నేరువరం: కరీంనగర్ నుంచి వయా గుండ్లపల్లి, మండల కేంద్రం గన్నేరువరం మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని బ్రిడ్జి జేఏసీ సాధన సమితి చైర్మన్ సంపత్ ఉదయ్ కోరారు. శనివారం ఆర్టీసీ అధికారులను కరీంనగర్‌లో కలిసి వినతపత్రం ఇచ్చినట్లు తెలిపారు. జంగపల్లి, గోపాల్‌పూర్, హన్మాజిపల్లె, మాదాపూర్ మండల కేంద్రం గన్నేరువరంతో పాటు ఇల్లంతకుంటకు, ఇటు కరీంనగర్‌కు వెళ్లడానికి బస్సులు లేక విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వస్తుందన్నారు. అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సును నడపాలని కోరారు. ప్రధాన కార్యదర్శి పుల్లెల రాములు, సభ్యుడు బండారి కళ్యాణ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో పూజలు

కరీంనగర్‌కల్చరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరాలయంలో శనివారం పూజలు నిర్వహించారు. మహిళలు దీపారాధన చేశారు. గంగాధర్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆరట్టు ఉత్సవం



హుజూరాబాద్‌లో అయ్యప్ప ఆరట్టు వేడుకలు

హుజూరాబాద్: అయ్యప్ప భక్తుల నామస్మరణతో శనివారం పట్టణం పులకించిపోయింది. అయ్యప్ప స్వామి ఆరట్టు ఉత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో అట్టహాసంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగా స్వామి ఉత్సవ విగ్రహంతో రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ రథోత్సవం పట్టణంలోని పురవీధుల గుండా సాగింది. అయ్యప్ప భక్తులు పరస్పరం రంగులు చల్లుకున్నారు. నాగేంద్ర స్వామి దేవాలయం వరకు రథయాత్ర కొనసాగింది.

గుర్తింపు కార్డుల పంపిణీ



కార్డులు అందిస్తున్న రమేశ్

చొప్పదండి: పద్మశాలీలు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని పద్మశాలి సంక్షేమ సంఘం మండల శాఖ అధ్యక్షుడు మచ్చ రమేశ్ అన్నారు. పద్మశాలి జిల్లా శాశ్వత గుర్తింపు కార్డులను ఆయన ఆధ్వర్యంలో చొప్పదండిలోని చేనేత సహకార భవనంలో శనివారం పంపిణీ చేశారు. పద్మశాలీలలో రాజకీయ, సామాజిక, ఆర్థిక చైతన్యం కోసం నేతలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇప్పనపల్లి సాంబయ్య, వల్లాల కృష్ణహరి, గాజంగి రాములు, ఎన్నం మునీందర్, గాలిపెల్లి రమణయ్య, అనుమాండ్ల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



చొప్పదండి: కేక్ కట్ చేస్తున్న నాయకులు



శాలపల్లిలో..

చొప్పదండి: కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్ ఆధ్వర్యంలో శనివారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ హాజరై కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అశోక్, గంగయ్య, రంగయ్య, సుధాకర్‌గౌడ్, చందు, రమేశ్‌గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌లో..

మానకొండూర్: మానకొండూర్‌లోని పల్లె మీద సోనియాగాంధీకి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి మాట్లాడారు. సర్పంచ్ బోళ్ల మురళి, తాళ్లపల్లి సంపత్‌గౌడ్, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, రేమిడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ మండలంలో..

తిమ్మాపూర్: మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలో నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.

శాలపల్లి-ఇందిరానగర్‌లో..

హుజూరాబాద్‌రూరల్: శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో కేక్ కట్ చేసి సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాబాజీ నాగరాజు, వేల్పుల విజయ్‌కుమార్, గద్దల శ్రీధర్, మారేపల్లి రాకేశ్, కాల్వ శివరెడ్డి, కంది నరసింహారెడ్డి, చిన్నక్క ప్రతాపరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరంలో..

గన్నేరువరం: గన్నేరువరంతో పాటు గుండ్లపల్లి జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల, వివిధ గ్రామాల్లో నిర్వహించారు. విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామడుగులో..



గుండ్లపల్లి జ్యోతిరావుపూలే పాఠశాలలో..

రామడుగు(చొప్పదండి): రామడుగు మండల కేంద్రంలో కేక్ కట్ చేశారు. వెలిశాల గ్రామ పరిధిలోని ప్రశాంత్‌భవన్‌లో మిఠాయిలు పంచి పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన మహాలక్ష్మీ పథకాన్ని ప్రారంభించి సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తిరుపతి, వంచ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడిలో..

చిగురుమామిడి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. హుస్నాబాద్ బస్ డిపోకు చెందిన బస్‌ను ముస్తాబు చేసి మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఉచిత బస్ ప్రయాణ కార్యక్రమాన్ని చిగురుమామిడి జెడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకుడు గీకురు రవీందర్ ప్రారంభించారు. చిటుమల్ల రవీందర్, దాసరి ప్రవీణ్‌కుమార్, పొన్నం సంపత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూజలు

సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంది తిరుపతిరెడ్డి, లక్ష్మణ్, రవి, భిక్షపతి, మల్లికార్జున్, అంజయ్య పాల్గొన్నారు.

శంకరపట్నంలో..



సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

శంకరపట్నం: మండల కేంద్రంలో సోనియా చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. బసవయ్య, రజితసంపత్, జంపయ్య, మహేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్‌లో..

సైదాపూర్: సైదాపూర్ కొత్త బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. దొంత సుధాకర్, గుండారపు శ్రీనివాస్, రాఘవులు, చాడ చైతన్యాకొండాల్‌రెడ్డి, లంకదాసరి అరుణమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. శ్రీవిశ్వేశ్వరస్వామి(బొమ్మల గుడి) దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. తుమ్మేటి సమ్మిరెడ్డి, కసుబోజుల వెంకన్న, పొనగంటి మల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరిసేడులో..

ఇల్లందకుంట: సిరిసేడు గ్రామంలో వంగ రామకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. శ్యామ్, చలపతి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శంకరపట్నంలో..



జమ్మికుంటలో..



సిరిసేడులో..

ఎస్‌జీఎఫ్ అండర్-14 క్రికెట్ పోటీలకు స్పందన



పాల్గొన్న క్రీడాకారులు

మానకొండూర్: అన్నారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలోని క్రీడామైదానంలో శనివారం అండర్-14 బాలుర క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. సమారు 300 మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభను కనబర్చారు. క్రికెట్ పోటీల సెలక్షన్‌ను గ్రామ సర్పంచ్ బొట్ల కిషన్ ప్రారంభించారు. సర్పంచ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. క్రీడా పోటీలకు ఎలప్పుడూ సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అంతడ్పుల శ్రీనివాస్, పీఈటీలు బండి రమ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం



హుజూరాబాద్‌లో మహాలక్ష్మీ పథకాన్ని ప్రారంభిస్తున్న వొడితల ప్రణవ్

హుజూరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిందని.. ఆరు గ్యారంటీ హామీలను పక్కాగా అమలు చేస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. శనివారం పట్టణంలోని బస్టాండ్‌లో మహాలక్ష్మీ పథకాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిందంటే కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. అంబేడ్కర్ చౌక్ సమీపంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ అర్పిత, ఎక్సైజ్ సీఐ దుర్గాభవానీ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఆలేటి సుశీల, కొల్లూరి కిరణ్, రాజేశ్వరరావు, శ్యామ్‌సుందర్‌రెడ్డి, చరణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కేశవపట్నంలో..

శంకరపట్నం: కేశవపట్నం బస్టాండ్‌లో శనివారం మహిళలకు ఉచిత ప్రయాణ బస్సు సౌకర్యాన్ని కాంగ్రెస్ మండల నాయకులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. బసవయ్య, పద్మ, మల్లారెడ్డి, జంపయ్య, రాజిరెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరంలో..

గన్నేరువరం: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని గన్నేరువరంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. అలువాల కోటి, చిట్కూరి అనంతరెడ్డి, బొడ్డు సునీల్, కొమ్మెర రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్‌లో..

సైదాపూర్: ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని ఆర్టీసీ హుస్నాబాద్ డిపో ఆర్సీ పన్యాల తిరుపతిరెడ్డి, మండల నాయకులు మండల కేంద్రంలో ప్రారంభించారు. గుండారపు శ్రీనివాస్, దొంత సుధాకర్, చాడ చైతన్యకొండాల్‌రెడ్డి, లంకదాసరి అరుణమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



గన్నేరువరంలో..

సామూహిక నిధి అందజేత



చెక్కు అందిస్తున్న పొదుపు సంఘం బాధ్యులు

హుజూరాబాద్: పట్టణంలోని మాధవ పురుషుల పొదుపు సంఘంలో సభ్యుడిగా ఉన్న ముద్దమల్ల క్రాంతికుమార్ గత నెల 30న మృతిచెందగా.. వారి కుటుంబ సభ్యులకు శనివారం సంఘం బాధ్యులు రూ.31వేల విలువ చేసే సామూహిక నిధి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తొర్రి రవి, ఉపాధ్యక్షుడు కొలిపాక కార్తీక్, సభ్యులు పసుల స్వామి, దండగుడుం అశోక్, సమితి గణకులు గాజ రమేశ్, సంఘ గణకులు ప్రతాప మహేశ్ పాల్గొన్నారు.

అవగాహనతోనే అవినీతి అంతం

కరీంనగర్‌కల్చరల్: అవినీతి నిర్మూలన చట్టాలపై అవగాహన పెంచుకొని, వాటి రక్షణలో భాగస్వాములవ్వాలని తెలంగాణ జనసత్తా రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. అప్పుడే అవి నీతి అంతమవుతుందని పేర్కొన్నారు. కరీంనగర్‌లోని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం కార్యాయంలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం జరిపారు. అవినీతి నిర్మూలనలో పౌర సమాజం పాత్ర అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. దేశంలోని అన్ని రంగాల్లో అవినీతి రాజ్యమేలుతోందని, ప్రభుత్వ నిధులు, పథకాలు ప్రజలకు దూరమవుతున్నాయని అన్నారు. సంఘం అధ్యక్షుడు సముద్రాల జనార్దన్‌రావు మాట్లాడుతూ.. సమాజంలో నైతిక విలువలు పతనమై, అవినీతి, నేరాలు పెరిగాయని అన్నారు. అవినీతి నిర్మూలన చట్టాలను పటిష్టంగా అమలు చేసే పాలనాపరమైన సంస్కరణలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తంగెడ నవనీతరావు, భూంపల్లి మోహనరెడ్డి, ముదుగంటి దామోదర్ రెడ్డి, నన్నపనేని గిరిబాబు, జి.సత్యనారాయణ రెడ్డి, గడప కోటేశ్‌కుమార్, మనోహర్ రాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్‌రూరల్: రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి జక్కం పుల్లయ్య ఒక ప్రకటనలో కోరారు.

అవగాహన సదస్సు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని నగునూరు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం.: 1800 425 9899